క్లుప్తంగా

సప్లిమెంటరీ పరీక్షలకు 60 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం జరిగిన పీఎస్ పరీక్షకు 275 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 215 మంది హాజరయ్యారు. మొత్తం 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ–2 మక్కా చిన్నారావు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

తుని: వర్షాలు కురిసే వరకూ పట్టణంలోని ఒకటి నుంచి 30వ వార్డుల్లో కుళాయిలకు ప్రెషర్ తక్కువగా ఉంటుందని బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరావు తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గతేడాది వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని, తాండవ రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోవడంతో పవర్‌బోరుల నుంచి పంప్ హౌస్‌లకు తక్కువగా నీరు చేరుతుందన్నారు. కుళాయిలకు సరఫరా చేసే నీరు కూడా తక్కువగా ఉండడంతో కుళాయిల వద్ద ప్రెషర్ తగ్గిపోతుందన్నారు. వర్షాలు కురిసే వరకూ ఈ సమస్య ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



ధర్మవరం ఉజ్జీవ సభలో ప్రసంగిస్తున్న షేక్ మక్బూల్

ప్రత్తిపాడు: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, ప్రతిఒక్కరూ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడవాలని పాస్టర్ షేక్ మక్బూల్ సూచించారు. మండలంలోని ధర్మవరంలో బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చ్ వ్యవస్థాపకుడు ఊబా కృపావరం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రక్షణ రాకడ సువార్త ఉజ్జీవ సభలు బుధవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో పాస్టర్ షేక్ మక్బూల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏసుక్రీస్తు రోగుల స్వస్థత కోసం, క్షమగుణం కోసం ఎంతో పరితపించారన్నారు. కార్యక్రమంలో ఎ.పాల్ శామ్యూల్, పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: పాయకరావుపేట, పెద్దాపురం మధ్యలో 132 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా శుక్రవారం పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ట్రాన్స్ కో జగ్గంపేట డీఈఈ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. తుని పట్టణం, తుని రూరల్, కోటనందూరు, తొండంగి మండలాల్లోని అన్ని గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా పాక్షికంగా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అధ్వానంగా ప్రధాన రహదారి


అప్పన్నపాలెంలో ప్రధాన రహదారికి చెంతనే ఉన్న వ్యర్థాలు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని అప్పన్నపాలెంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. నిత్యం ఈ ప్రాంతం మీదుగా పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి చెంతనే చెత్త, వ్యర్థాలు గుట్టలుగా వేయడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ వ్యర్థాల నుంచి దుర్వాసన రావడంతో కాలినడకన వెళ్లే పాదచారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సమీపంలోని ఏలేరుకాలువకు వెళ్లే మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణకు గొడుగును ఆశ్రయించిన యువతులు


పెద్దిపాలెం ఏలేరు కాలువలో జలకాలు ఆడుతున్న యువకులు


రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి


ఎండకు జాతీయ రహదారిపై చెట్ల కింద నిలిపిన వాహనాలు

నిప్పుల కొలిమి

- తారెత్తిస్తున్న ఎండలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన కూడళ్లు

గోకవరం: కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణి కార్తె ప్రారంభం నుంచే రోళ్లు బద్దలయ్యేలా ఎండ కాస్తోంది. మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం భానుడు నిప్పులు కురిపించాడు. ఉదయం 10 గంటల నుంచి వడగాడ్పులు వీశాయి. ఎండ తీవ్రత, ఉక్కబోత గంటగంటకూ పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 11 గంటలకే వ్యాపారులు షాపులు మూసివేసి ఇంటిబాట పట్టారు. ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. రాత్రి 7 గంటల వరకూ వేడిగాలులు వీయడంతో ఇంట్లో ఉన్న వారు సైతం అసౌకర్యానికి గురయ్యారు.

ప్రత్తిపాడు రూరల్: ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉంది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు తారాస్థాయికి చేరుకున్నాయి. గత రెండు నెలలుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుతు పడుతున్నారు.


ధర్మవరంలో ఎండ నుంచి రక్షణకు చీర చెంగు అడ్డుపెట్టుకున్న మహిళ

నియోజకవర్గంలో బుధవారం ఎండ తీవ్రతతో పాటు, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోయారు. రుతుపవనాలు మరో కొద్ది రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. మరో రెండు, మూడు రోజుల్లో ఎండలు తగ్గుముఖం పడతాయని ప్రజలు భావించారు. అయితే ఎండలు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపించడం లేదు. రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఎండల తీవ్రత మరింత ఎక్కువైంది. ఒకపక్క ఎండ మరో పక్క ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. పగటి పూట 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్ల, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. బుధవారం ఎండ తీవ్రతను తట్టుకోలేక 16 నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్టకింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగిస్తున్నారు. ఎండ


ఎండలకు జనసంచారం లేని ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డు

తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు సీతలపానియాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, కూల్‌డ్రింక్‌ల విక్రయాలు జోరందుకున్నాయి.

ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం

కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంఓ నీటి శాతం తగ్గడం) డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. దీంతో ఎండల తీవ్రత తగ్గే ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎండ సమయంలో ఇంటి నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

వడదెబ్బకు ప్రథమ చికిత్స ఇలా...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడిక్లాత్‌తో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి, లేని పక్షంలో గ్లూకోజ్ ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసు కెళ్లాలి.

అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: వారం రోజులుగా ఎండలు మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉక్కపోతకు గురవుతున్నారు. గ్రామాల్లో అడపాదడపా విద్యుత్ కోతలు విధించడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి


గోకవరంలో నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ బస్టాండ్ సెంటర్

సాయంత్రం 5 గంటల వరకూ వడగాడ్పులు వీశాయి. వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ సూచించారు.

ఉక్కపోతతో ఇక్కట్లు

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి విద్యుత్ కోతలు తోడవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం తొమ్మిది గంటలకే రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీనికి తోడు అడపా దడపా విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇళ్లలో ఉక్కపోతకు గురై ఇబ్బందులు పడ్డారు. మరికొద్ది రోజులపాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

42 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రత్తిపాడు: వారం రోజులుగా భానుడు భగభగ మండిపోతున్నాయి. నియోజకవర్గంలో బుధవారం వాతావరణం నిప్పుల కొలిమిని తలపించింది. ఏటా వేసవికాలంలో రోహిణి ప్రారంభంలో ఇంత వేడిమి చూడలేదంటున్నారు ప్రజలు. ఉదయం 11 గంటలకే 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇంటో ఉక్కపోతకు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనులకు వెళ్లే కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక ఉదయం 10 గంటలకే ఇంటిముఖం పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు తీసుకోవాలి. ఏవైనా పనులు ఉండే తప్ప ఎండలో తిరగకూడదు. అత్యవసరంగా ఎండలో బయటకు వెళ్లల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపి, ధరించాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. – డాక్టర్ కె.మురళీమోహన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, శాంతిఆశ్రమం, ప్రత్తిపాడు మండలం

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా


ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, రైతు కూలీలు

ప్రత్తిపాడు: తమ భూములను ఆక్రమించుకున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గోకవరం పంచాయతీ గిరిజనాపురం తండాకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గిరిజనాపురం తండాలోని సర్వే నంబర్ 5లో 9.68 ఎకరాల భూమి ఆదివాసీ కొండరెడ్ల తెగకు చెందిన గిరిజనుల స్వాధీనంలో ఉందన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన కొందరు భూస్వాములు ఈ భూమికి అక్రమంగా రికార్డులు సృష్టించి, గిరిజన భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గిరిజనులను బెదిరించి, భూమిలోని జీడి మామిడి, మామిడి తోటలను తొలగించారని వాపోయారు. అధికారులు దీనిపై విచారణ చేపట్టి, గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, గిరిజనులు మాతే వరలక్ష్మి, ఉల్లి రాజమ్మ, మాతే నూకరాజు, ఉల్లి బుల్లెమ్మ, మాతే ధారకుమారి తదితరులు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లిలో బాటసారులు, విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ సమీపంలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యడ్లపల్లి రమేష్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కాత్రావులపల్లి ప్రధాన కూడలిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో వేలాది మంది దాహార్తిని తీర్చడానికి వీలుంటుందని నిర్వాహకులు తెలిపారు. వేసవి ప్రారంభం నుంచి చలివేంద్ర ఏర్పాటు చేసి బాటసారులకు మజ్జిగ, తాగునీరు అందిస్తున్నామని, కాగా ప్రయాణికులు, బాటసారులు, విద్యార్థుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన రమేష్ దీనిని ఏర్పాటు చేశారని సేవా సంఘం సభ్యులు తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన ప్రతిఒక్కరికీ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, సేవాసంఘం సభ్యులు సుంకర శ్రీను, మద్దూరి శ్రీను, రాయి శ్రీనివాస్, పెంటపాటి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి


పెద్దాపురం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్


చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు

సామర్లకోట: సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని డివైడర్‌లో ఉన్న మొక్కల సంరక్షణపై పెద్దాపురం మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికార పార్టీ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ అన్నారు. బుధవారం పెద్దాపురంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ రోడ్డు వెంబడి డివైడర్‌లో ఉన్న మొక్కలు ఎండలకు చనిపోతున్నాయని, వాటికి నీరు పోసే ఏర్పాట్లు చేయడంతో పాటు కొత్త మొక్కలు వేయాలని సూచించారు. అదే విధంగా మున్సిపాలిటీ కొనుగోలు చేసిన జేసీబీని సక్రమంగా ఉపయోగించే విధంగా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ పూర్తయిన తరువాత మొక్కల విషయం పరిశీలిస్తామని కమిషనర్ పద్మావతి అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా చర్చలు జరపడానికి అవకాశం లేదన్నారు. వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావిద్ రాజు, మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఫణికుమార్, అధికార, ప్రతిపక్ష సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యదేవుని గ్రామోత్సవం

గోకవరం: మండలంలోని వెదురుపాకలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో ఉషాపద్మినీ, ఛాయా సమేత సూర్యనారాణస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో హిందువులకు సూర్యోపాసన వైపు నడిపించాలనే ఉద్దేశంతో గ్రామగ్రామాన స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ హిందూధర్మ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొరిపల్లి అప్పలస్వామి, మేడపురెడ్డి అక్కినాయుడు, బత్తుల రాంప్రసాద్, పిల్లంగోరు పాపారావు, బొడ్డు వెంకటేశ్వరరావు, కొరిపల్లి శ్రీశైలం, రాఘవ, దేవుడమ్మ, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.


వెదురుపాకలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు హారతులు ఇస్తున్న మహిళలు

విద్యార్థులకు క్విజ్ పోటీలు


ఏలేశ్వరం గ్రంథాలయంలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కస్తూరి సతీష్‌బాబు విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై పట్టు సాధించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం, పోటీతత్వ పెరుగుతాయన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


వీరవరంలో గ్రంథాలయంలో క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ పొందిన విద్యార్థులు

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

కిర్లంపూడి: వీరవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు, క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల మేధోశక్తిని పెంచేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అసంపూర్తిగా హాస్టల్ నిర్మాణ పనులు


కోటనందూరు హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిన హాస్టల్ నిర్మాణ పనులు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన బాలికల వసతి గృహం నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఆర్ఎంఎస్ఏ నిధులు రూ.1.94 కోట్లతో చేపట్టిన ఈ హాస్టల్ నిర్మాణ పనులను రెండేళ్ల క్రితానికే పూర్తి చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు గతంలో ప్రకటించినప్పటికీ పనులు ఆ దిశగా జరగలేదు. శ్లాబ్ లెవెల్ వరకూ పనులు వేగంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తుదిదశ పనులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారు. నిర్ణీత సమయం గడిచిపోయినా హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రమైన కోటనందూరులో ఈ హాస్టల్ అందుబాటులోకి వస్తే మండలంతో పాటు పక్కనే ఉన్న రౌతులపూడి, అనకాపల్లిజిల్లా నాతవరం మండలాల్లో విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్ నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచారామ క్షేత్రంలో శివలింగం జీర్ణోద్ధరణ

- పనులు ప్రారంభించిన పురావస్తు శాఖ
- ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. క్షేత్రంలో స్వామివారి శివలింగం జీర్ణస్థితికి చేరుతున్నట్లు గుర్తించి దేవదాయ శాఖాధికారుల సూచనల మేరకు కేంద్ర పురావస్తు శాఖ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా శివలింగానికి జీర్ణోద్ధరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ శివలింగం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా స్వామివారి, అమ్మవార్ల దర్శనాలు నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు మండపారాధనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కలశస్థాపన, కళారాధన, దేవతారాధన, అగ్నిహోత్ర సంబంధమైన హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణకంభంలో కళలను ఆవాహన చేశారు. ఈ మేరకు ఉత్సవ, దేవతామూర్తులను ఆవాహన చేసిన పూర్ణకుంభాన్ని నంది మండపంలో ఏర్పాటు చేసి ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు చేశారు. నంది మండపంపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులను ఉదయం 10.40 గంటలకు భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించారు.


ఆలయంలో అగ్నిహోత్ర హోమం నిర్వహిస్తున్న పండితులు


పురావస్తు శాఖ అధికారులతో చర్చిస్తున్న ఈఓ భళ్ల నీలకంఠం

దర్శనాలు నిలిపివేసి..

అతిపురాతన పంచారామ క్షేత్రంలోని స్వామివారిని భావితరాల వారు దర్శించుకునే విధంగా 15 ఏళ్ల కిందట కెమికల్ ట్రీట్‌మెంట్ చేశారు. కాగా బుధవారం నుంచి మళ్లీ శివలింగానికి కెమికల్ ట్రీట్‌మెంట్ చేయడానికి శివలింగాన్ని పురావస్తు శాఖాధికారులకు ఈఓ భళ్ల నీలకంఠం స్వాధీనం చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకోవడం మంచిది కాదని, గర్భాలయాలను మూసి వేసి భక్తుల దర్శనాలు నిలిపివేశారు. భక్తులు ధ్వజస్తంభం మీదుగా ఆలయంలోకి ప్రవేశించి పెద్ద నంది వద్ద ఉన్న మండపంపై ఉత్సవ మూర్తులను దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జీర్ణోద్ధరణ పనులకు సంబంధించి ఏర్పాట్లను పురావస్తు శాఖ సీఏ కేవీఎస్ మూర్తి, ఉపస్తపతి జి.శ్రీనివాసాచార్యులు, ఈఓ భళ్ల నీలకంఠం పరిశీలించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదానం కొనసాగింది. భక్తులకు దేవస్థాన సిబ్బంది, భక్త సంఘ నాయకుడు తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ సేవలందించారు.